సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 17 । మే । 2025



వర్షానికి తడిసిన ధాన్యం

పాల్వంచ, సుజాతనగర్ మండలాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. IIలో



హైపర్.. టెన్షన్

ఆధునిక జీవనశైలితో రక్తపోటు (బీపీ) బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38°/ 26°

జిల్లాలో శనివారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం తరువాత ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

రామాలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన భక్తురాలు సీహెచ్ సరస్వతి రూ.2 లక్షల చెక్కును ఆలయ ఈఓ ఎల్.రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి అర్చకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతంతో అభిషేకపూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు, కుంకుమ పూజ, గణపతి హోమం నిర్వహించారు.

గిరిజన గురుకుల కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ



విద్యార్థినికి అడ్మిషన్ ఫాం ఇస్తున్న పీఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయని పీఓ బి.రాహుల్ తెలిపారు. గురుకులాల్లో బాలికలకు 737సీట్లు ఉండగా, భద్రాచలంలోని గురుకుల కాలేజీలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థినుల్లో 737మందికి మెరిట్ ఆధారంగా వారు కోరుకున్న కాలేజీల్లో సీట్లు కేటాయించామని పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓలు అరుణకుమారి, పద్మావతి, ప్రిన్సిపాళ్లు చైతన్య, నాగేంద్రమ్మ, రాణి, ఓ.మాధవి, సంధ్యారాణి, మాధవీలత, ఓ.పుల్లమ్మ పాల్గొన్నారు.

ఇప్పుడు ప్రారంభిస్తేనే మేలు




కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు

కాళేశ్వరంలో వైభవంగా సరస్వతి పుష్కరాలు

- 2027 జూలైలో గోదావరికి పుష్కరాలు
- రాష్ట్ర విభజనతో భద్రగిరిలో మారిన పరిస్థితులు
- కార్యాచరణ సిద్ధం చేయాలని కోరుతున్న భక్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి తీరం వెంబడి కాళేశ్వరంలో కనుల పండువగా సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయి. అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి పుష్కరాల కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. వీటితో కాళేశ్వరంలో కొత్తగా సరస్వతి మాత విగ్రహం, స్నానఘట్టాలు, నదీ తీరం వెంబడి కొత్త రోడ్లు, టెంట్ సిటీలు వెలిశాయి. ఇదే తరహాలో గోదావరి పుష్కరాలకు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో నెలకొన్న స్థల సమస్య, రోజురోజుకూ పెరుగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని గోదావరి పుష్కరాలకు యాక్షన్ ప్లాన్ ముందుగానే సిద్ధం చేయాలని భక్తులు కోరుతున్నారు. లేదంటే 2015 పరిస్థితే పునరావృతం అవుతుందని ఆందోళన చెందుతున్నారు.



వన్నె తెచ్చిన పుష్కరాల పనులు

ఈ శతాబ్దంలో 2003, 2015లలో గోదావరికి పుష్కరాలు వచ్చాయి. ముఖ్యంగా 2003 పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన కరకట్ట, స్నానఘట్టాలు భద్రాచలం రూపు రేఖలను మార్చివేశాయి. కరకట్ట నిర్మాణంతో భద్రాచలం పట్టణానికి గతంలో పోల్చితే వరదల నుంచి భద్రత కలిగింది. విశాలమైన స్నానఘట్టాలు వచ్చాయి. మహిళలు బట్టలు మార్చుకునే గదులు, కల్యాణకట్టలు అందుబాటులోకి వచ్చాయి. గోదావరి మాతకు విగ్రహం, రామాయణ ఇతివృత్తం తెలిపేలా శిల్పాలను ఏర్పాటు చేశారు. దీంతో భద్రాచలానికి కొత్త శోభ వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత 2015లో జరిగిన పుష్కరాలకు చెప్పుకోతగ్గ పనులేవీ భద్రాచలంలో జరగలేదు. గతంలో ఉన్న వాటినే మరికొంత మెరుగు పరిచారు. కొత్త రాష్ట్రంగా ఏర్పాటుకావడం, ఇక్కడ స్థల సమస్యలు వంటి అంశాలు అప్పుడు పుష్కర పనులకు అడ్డం పడ్డాయి.

భద్రాచలమే కీలకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పటి నుంచి గోదావరి పుష్కరాలంటే ఆంధ్రకు రాజమండ్రి, తెలంగాణకు భద్రాచలం కేంద్ర స్థానంగా ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత భారీ స్థాయిలో ఏర్పాట్లు చేయనప్పటికీ భద్రాచలం ప్రధాన కేంద్రంగానే ఉంది. కొత్తగా ధర్మపురి, కోటిలింగాల, కాళేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలు గోదావరి పుష్కరాల్లో ప్రముఖంగా నిలిచాయి. తిరిగి గోదావరికి 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు పుష్కరాలు జరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు, భద్రాచలం పట్టణం, ఏడాది పొడవునా ఇక్కడ జరిగే కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఏర్పాట్ల యాక్షన్ ప్లాన్ రెడీ చేయాల్సిన అవసరముంది. లేకపోతే 2015 తరహాలోనే పైపనులే చేపడితే మరోసారి భద్రాద్రి నష్టపోక తప్పదు.

కీలక అంశాలు

రాష్ట్ర విభజన కారణంగా భద్రాచలం క్షేత్రంలో స్థల సమస్య ఏర్పడింది. దీంతోపాటు ఏటా జూలైలో వచ్చే వరదలను దృష్టిలో ఉంచుకుని నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా టెంట్ సిటీ, స్మార్ట్ సిటీలను ఎక్కడ నిర్మించాలనే అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ప్రస్తుతం భద్రాచలంలో సామాన్య భక్తుల పుష్కర ఘాట్, బూర్గంపాడు మండలం మోతె దగ్గర వీఐపీ ఘాట్‌లు ఉన్నాయి. రాబోయే రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్య రాకుండా కొత్త ఘాట్లను నిర్మించాలి. వాహనాల పార్కింగ్, రాకపోకలపైనా అధ్యయనం చేయాల్సి ఉంది. వీటితో పాటు ఏడాది పొడవునా భద్రాచలం వచ్చే భక్తులకు ఉపయోగపడేలా డార్మిటరీలు, లాకర్లు, సామూహిక స్నానాల గదులు, టాయిలెట్ల నిర్మాణాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. నదీ తీరంలో సాంస్కృతి కార్యక్రమాలు జరిగేలా అంఫీ థియేటర్, కరకట్ట పైకి సులువుగా ఎక్కి దిగేలా లిఫ్టులు, అదనపు ర్యాంపులు, ఐకానిక్ వంతెన తదితర నిర్మాణాలు వంటివి రాబోయే పుష్కర పనుల్లో కీలకంగా మారనున్నాయి.

మరో థర్మల్ కేంద్రం వచ్చేనా!



కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం కూల్చివేయడంతో అందుబాటులోకి వచ్చిన స్థలం

- కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం తొలగింపుతో కళతప్పిన పాల్వంచ
- కొత్త కర్మాగారం ఏర్పాటుకు భౌగోళిక వనరులు పుష్కలం
- నేడు పాల్వంచలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న పాల్వంచ కేటీపీఎస్‌లో మరో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇక్కడ కాలం చెల్లిన 720 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం(పాతప్లాంట్)ను తొలగించారు. ఇందులో పనిచేసే సుమారు రెండు వేల మంది ఉద్యోగ, కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ క్రమంలో వారు కుటుంబాలతో సహా వెళ్లిపోవడంతో పాల్వంచ పట్టణంపై తీవ్ర ప్రభావం పడింది. వర్తక, వాణిజ్య, ఉపాధి, రియల్ ఎస్టేట్ రంగాలు దెబ్బతిని అభివృద్ధి కుంటుపడుతోంది. పాల్వంచ కళతప్పింది. ఇక్కడి భౌగోళిక వనరుల దృష్ట్యా మరో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (కేటీపీఎస్ 8వ దశ) నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. శనివారం పాల్వంచలో పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టి సారించి పాల్వంచకు పూర్వవైభవం తెచ్చేలా కృషి చేయాలని విన్నవిస్తున్నారు.

అందుబాటులో వనరులు

కాలం చెల్లిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్) కర్మాగారాన్ని 2018 సంవత్సరంలో మూసివేశారు. అనంతరం పాత ప్లాంట్‌లోని నిర్మాణాలన్నింటినీ తొలగించారు. ఈ క్రమంలో అక్కడ వందలాది ఎకరాల స్థలం ఖాళీ ఏర్పడింది. కేటీపీఎస్ ఏ, బీ, ఇంటర్మీడియట్ కాలనీలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ క్వార్టర్లను తొలగించి అపార్ట్‌మెంట్‌లు నిర్మించాలని యాజమాన్యం యోచిస్తోంది. ఇది కార్యరూపం దాలిస్తే ఆయా కాలనీల్లో సైతం స్థలం మిగిలే అవకాశం ఉంది. కేటీపీఎస్ విస్తరణకు ఈ స్థలాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. తద్వారా సౌకర్యాలు మరింతగా మెరుగుపడనున్నాయి. ఇక కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి పుష్కలంగా నీరు , కొత్తగూడెం, మణుగూరుల నుంచి రైల్వే మార్గాల ద్వారా సింగరేణి బొగ్గు సరఫరా అవుతోంది. పాత యాష్ పాండ్‌లు, నీటి నిల్వ ప్రాంతాలను కూడా సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో మరో విద్యుత్ కేంద్రం నిర్మించవచ్చు.

రెండు వేల మంది ఉద్యోగులు బదిలీ

ఓఅండ్‌ఎం మూసివేయడంతో సుమారు రెండు వేల మంది ఉద్యోగులు ఇతర కర్మాగారాలకు బదిలీలు, డిప్యూటేషన్‌లపై వెళ్లారు. కేటీపీఎస్‌లో నూతన కర్మాగారం నిర్మించి ఆ ఉద్యోగులను ఇక్కడికి తీసుకురావాలని ఉద్యోగ సంఘాలు సైతం కోరుతున్నాయి. ప్రస్తుతం కేటీపీఎస్ 5,6 దశల్లో 1000 మెగావాట్లు, 7వ దశలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. వచ్చే పదేళ్ల తర్వాత 5,6 దశల కర్మాగారాలు సైతం కాలంచెల్లి మూసివేయాల్సి వస్తుంది. అప్పటిలోగా కొత్త కర్మాగారం అందుబాటులో తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. నూతన కలెక్టరేట్ సమీపంలోని స్థలంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని జెన్‌కో యాజమాన్యం యోచించింది. సర్వే కూడా పూర్తి చేసింది. నిర్మాణ పనులు మాత్రం ముందుకు పడటం లేదు. ఈ నేపథ్యంలో నేడు పర్యటించనున్న ఉప ముఖ్యమంత్రి పాల్వంచ పట్టణాభివృద్ధిపై ప్రకటనలు చేస్తారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

తీరని వేతన వెతలు

- విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులకు అరకొర జీతాలు
- ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాలు పెంచని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 230 మంది స్పాట్ బిల్లింగ్ కార్మికులు



మీటర్ రీడింగ్ నమోదు చేస్తున్న కార్మికుడు

ఇల్లెందు: విద్యుత్ శాఖలోని మీటర్ రీడింగ్ కార్మికులు(స్పాట్ బిల్లర్) అరకొర వేతనాలతో అవస్థలు పడుతున్నారు. వచ్చే వేతనమే తక్కువగా ఉంటే అది కూడా రెండు, మూడు నెలలకోసారి ఇస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 వేలమందికి పైగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 230 మంది మీటర్ రీడింగ్ కార్మికులు పని చేస్తున్నారు. పట్టణాల్లో ఇద్దరు, ముగ్గురు, మండలానికి ఒక్కరు చొప్పున ఉన్నారు. వీరంతా ప్రతీ నెలా 1వ తేదీ నుంచి 12వ తేదీ లోపు మీటర్ రీడింగ్ తీసి బిల్లులు ఇస్తారు. ఇందుకోసం ఒక్కో విద్యుత్ కనెక్షన్‌కు రూ. 3.85 కమీషన్ ఇస్తున్నారు. ఒక్కొక్కరికి కనీసంగా 3 వేల కనెక్షన్లు కేటాయిస్తున్నారు. స్పాట్ బిల్లింగ్ కార్మికులు కేటగిరీ–1 మీటర్ రీడింగ్ తీస్తుండగా విద్యుత్ సంస్థ ఉద్యోగులు కేటగిరీ–2 నుంచి కేటగిరీ–10 వరకు రీడింగ్ తీస్తున్నారు. స్పాట్‌బిల్లింగ్ కార్మికులు భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 2,42,705 మీటర్‌ల నుంచి రీడింగ్ తీసి బిల్లులు జారీ చేస్తున్నారు.

పనికి తగిన ప్రతిఫలం అందక..

స్పాట్ బిల్లింగ్ కార్మికులకు శ్రమకు తగిన ప్రతిఫలం అందడంలేదు. నెల మొత్తం కష్టపడితే రూ.16 వేల వరకు వచ్చే అవకాశం ఉంది. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాలు పెరగడంలేదు. కమీషన్ పద్ధతిలో కాకుండా కన్సల్టెన్సీ పద్ధతిలో వేతనం ఇవ్వాలని, లేకపోతే ఆర్టిజన్లుగా గుర్తించాలని స్పాట్ బిల్లర్లు కోరుతున్నారు. ప్రతీ నెల 30 పని దినాలు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని, సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ పోస్టుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అనేక ఏళ్లుగా సమ్మెలు, ఆందోళనలు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఖమ్మంలో ఎమ్మెల్సీ కోదండరాంను సైతం కలిసి వినతి పత్రం అందజేశారు.

కార్మికులను ఆదుకోవాలి



15 ఏళ్లుగా పని చేస్తున్న స్పాట్ బిల్లింగ్ కార్మికులను విద్యుత్ సంస్థ, ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రతీ నెలా వేతనం అందేలా చూడాలి. ఆర్టిజన్లుగా గుర్తించాలి. కనీసం నెలకు రూ. 20 వేలు వేతనం చెల్లించాలి.

– కిరణ్, స్పాట్ బిల్లింగ్ కార్మికుడు, ఇల్లెందు

ప్రభుత్వం చొరవ చూపాలి



స్పాట్ బిల్లింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. సమ్మె చేస్తే ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తోంది. ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. శాశ్వత పరిష్కారం చూపాలి.

–గుమ్మడి వెంకటేశ్వర్లు, స్పాట్ బిల్లింగ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

బెనిఫిట్స్ అందించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులకు గతంలో మాదిరిగా ఉద్యోగ విరమణ రోజే టర్మినల్ బెనిఫిట్స్ (సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ) అందజేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, కారుణ్య నియామకాలు, ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగుల సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, డిపెండెంట్ బాధితులను ఇబ్బందులకు గురి చేయొద్దని అధికారులను ఆదేశించారు. పర్సనల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పాల్వంచ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం టీజీ జెన్‌కో గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీనివాస కాలనీలో రూ.1.96 కోట్లతో, పాండురంగాపురంలో రూ. 2.63 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లు, సోములగూడెంలో రూ.4 కోట్లతో చేపట్టనున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, రూ.9.70 కోట్లతో రాజాపురం వద్ద నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. త్వరలో కొత్తగూడెం క్రాస్ రోడ్‌లో జూ పార్క్, సుజాతనగర్‌లో జూనియర్ కళాశాల రానున్నాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ సతీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాగసీతారాములు, కనగాల అనంతరాములు, సూకల రంగారావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బొట్టూబొట్టు ఒడిసిపట్టేలా..



చంద్రుగొండలో ఫామ్‌పాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ జితేష్ (ఫైల్)



ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో నిర్మించిన ఇంకుడుగుంత

- జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు భగీరథ ప్రయత్నం
- ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్ నిర్మాణాలకు కార్యాచరణ
- కలెక్టర్ చొరవతో సమష్టిగా కృషి చేస్తున్న అధికారులు
- వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రారంభం

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాబోయే వర్షాకాలంలో ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతలు, ఫామ్‌పాండ్స్ నిర్మాణానికి అధికారులు సమాయత్తమవుతున్నారు. భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లలో కచ్చితంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని, ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చేముందు ఇంకుడు గుంతల నిర్మాణాలు తప్పనిసరి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటిస్తూ ఇంకుడు గుంతల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల సమష్టి కృషితో నిర్వహిస్తున్న భగీరథ ప్రయత్నాలు దేశంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలచేలా పరుగులు పెడుతోంది.

వ్యవసాయ శాఖ లక్ష్యం 34,629 ఫామ్‌పాండ్స్

సాగు భూముల్లో ప్రతి పదెకరాలకు ఒక ఫామ్‌పాండ్ చొప్పున జిల్లావ్యాప్తంగా 34,629 ఫామ్‌పాండ్స్ నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే 600 ఫామ్‌పాండ్స్ నిర్మాణాలకు మార్కింగ్‌ను కూడా పూర్తి చేశారు. ఒకవైపు ఇంకుడు గుంతలు, మరోవైపు ఫామ్‌పాండ్స్ నిర్మాణాలు జిల్లాలో ఊపందుకోనున్నాయి. కలెక్టర్ స్వయంగా పలుగు, పార పట్టి నిర్మాణ పనులు ప్రోత్సహిస్తున్నారు. తాజాగా ఎస్పీ రోహిత్‌రాజు కూడా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో, పోలీస్ కార్యాలయాలలో ఇంకుడుగుంతలు నిర్మించాలని ఆదేశాలు జారీచేశారు.

‘ఉపాధి’లో నీటి కుంటలు..



రాజాపురంలో నీటికుంటను పరిశీలించి మాట్లాడుతున్న ఏఓ శంకర్

పాల్వంచరూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా నీటి కుంటలను నిర్మిస్తుందని మండల వ్యవసాయాధికారి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రాజాపురంలో ఓ రైతు నిర్మిస్తున్న నీటికుంటను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ పంట పొలాల్లో నీటి కుంటలు నిర్మించుకోవాలని అన్నారు. 15 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నిర్మాణం చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడి వచ్చినప్పుడు కుంటలోని నీరు పంటలకు ఉపయోగపడుతుందని, చేపలను పెంచుకునే అవకాశం కూడా ఉంటుందని వివరించారు.

అత్యధికంగా ఫామ్‌పాండ్స్ నిర్మించే మండలాలు

మండలం	రైతులు	సాగుభూమి(ఎకరాల్లో)	ఫామ్‌పాండ్స్
అశ్వారావుపేట	9,861	36,608.77	3,661
దుమ్ముగూడెం	12,289	34,560.54	3,456
ములకలపల్లి	6,573	21,898.71	2,190
చర్ల	9,234	20,435.74	2,044
జూలూరుపాడు	8,125	20,158.51	2,016
టేకులపల్లి	6,902	19,476.25	1,948

నిర్దేశిత లక్ష్యాన్ని సాధిస్తాం



జిల్లాలో భూగర్భ జలాల పెంపు కోసం 34,629 ఫామ్ పాండ్స్ నిర్మించాలని వ్యవసాయ శాఖకు లక్ష్యం నిర్దేశించారు. లక్ష్యాన్ని సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సాగుభూముల పరిశీలన ప్రారంభమైంది. రైతులకు అవగాహన కల్పించి ఫామ్‌పాండ్స్ నిర్మాణాలను సమష్టిగా పూర్తి చేస్తాం. – వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆదివాసీల అభివృద్ధికి తోడ్పాటునందించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చంద్రుగొండ : ఆదివాసీలు చేపట్టిన బ్యాంబో క్లస్టర్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని బ్యాంబో ఇండస్ట్రీస్ ఫౌండేషన్ (బెంగళూరు) సీఈఓ నేజుజార్జ్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. మండలంలోని బెండాలపాడు గ్రామశివారులోని బ్యాంబో క్లస్టర్‌ను శుక్రవారం కలెక్టర్, బెంగళూరు బృందంతో కలిసి సందర్శించారు. వెదురుతో చేస్తున్న ఉత్పత్తులను వారికి చూపించి, క్లస్టర్ అభివృద్ధికి కావాల్సిన సదుపాయాలు, తదితర అంశాలపై చర్చించారు. తగిన సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఫౌండేషన్ ప్రతినిధి దివ్య, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, క్లస్టర్ డైరెక్టర్ బొర్రా సురేష్, గ్రామస్తులు రాము, తేజావత్ బాబు, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

చివరిగింజ వరకూ ధాన్యం కొనుగోళ్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎలాంటి అవాంతరాలు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 34,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రానున్న పదిరోజుల్లో మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, డీఎస్‌ఓ రుక్మిణి, పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌బాబు, డీఏఓ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంబో ఇండస్ట్రీస్ సీఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

క్లుప్తంగా

డెంగీ నివారణకు సహకారం అవసరం


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్: డెంగీ ప్రమాదాన్ని తగ్గించేందుకు అందరి సహకారం అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి భాస్కర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. డెంగీ నివారణ, నియంత్రణ గురించి అవగాహన పెంచడానికి ఏటా మే 16న జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది 'చెక్, క్లీన్ అండ్ క్లియర్'అనే థీమ్‌ను పౌరులు పాటించాలని, నీటిని తనిఖీ చేయాలని, దోమల లార్వాలను నాశనం చేయాలని, నిల్వ చేసిన నీటిని కవర్ (మూ) చేయాలని తెలిపారు. అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్ (మలేరియా) డాక్టర్ పి.స్పందన మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్.జయలక్ష్మి, యూపీహెచ్‌సీ నుంచి వైద్య అధికారులు, పారామెడికల్ సిబ్బంది, కుమారస్వామి, జేతు నగేశ్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న శాస్త్రవేత్త

టేకులపల్లి: రైతులు అధికంగా యూరియా వాడటం వల్ల చీడపీడలు పెరిగి పెట్టుబడి ఖర్చు పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రావు, ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్ అన్నారు. శుక్రవారం బేతంపూడిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు – అన్నదాత అవగాహన'కార్యక్రమంలో భాగంగా వారు రైతులకు అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరం మేరకు రసాయనాలను వాడాలని, పచ్చిరొట్ట పైర్లు వేసుకుని నేలలో కర్బన శాతాన్ని పెంచుకోవాలని తెలిపారు. ఆరు తడి ద్వారా వరి సాగు చేయాలని, కంది, పెసర, మినుము పంటలను సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. ఉద్యానవన శాఖలో శాశ్వత పందిళ్లు, మల్చింగ్ పేపర్ వేసుకోవడానికి, పామాయిల్‌కు 50 శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఏఓ అన్నపూర్ణ, హెచ్ఓ స్రవంతి, ఏఈఓలు ప్రవీణ్, రమేశ్, శ్రావణి, భాగ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.

ఆదనపు షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఈఓ రమాదేవి


భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి శ్రీగోకులరామంలో గోవులశాలకు అదనంగా మరో రెండు షెడ్లు నిర్మించేందుకు ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. దేవస్థానానికి చెందిన ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న గోశాలకు మరో రెండు షెడ్లను నిర్మించేందుకు ప్రవాస భారతీయులు సూదిరెడ్డి రామకృష్ణారెడ్డి – శాంత, సత్యనారాయణరెడ్డి – విజయ దంపతులు విరాళం అందజేయగా.. దాతల కుటుంబ సభ్యులతో కలిసి ఈఓ రమాదేవి భూమి పూజ చేశారు.

కొబ్బరి చెట్లపై పిడుగులు


పిడుగు పడటంతో కాలిన కొబ్బరిచెట్టు

చింతకాని/కామేపల్లి: చింతకాని మండలంలోని జగన్నాథపురంలోని ఆలస్యం వెంకయ్య ఇంట్లో ఉన్న కొబ్బరి చెట్టుపై శుక్రవారం తెల్లవారుజామున పిడుగు పడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడడంతో చెట్టుపై 20 నిమిషాల పాటు మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో వెంకయ్య ఇంట్లో అద్దెకు ఉంటున్న కోలేటి రాంచందర్‌రావు గృహంలోని ఎలక్ట్రానిక్స్ సామగ్రి, వైరింగ్ పూర్తిగా కాలిపోయింది. అలాగే, కామేపల్లి మండలం తాళ్లగూడెంలోని బండారి రామయ్య ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపైనా పిడుగు పడింది. అయితే, అంతసేపు రామయ్య ఆరు బయటే నిద్రించగా, వర్షం వస్తుండడంతో లోపలకు వెళ్లాడు. అదే సమయాన పిడుగు పడడంతో ప్రమాదం తప్పినట్లయింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

హైపర్.. టెన్షన్

అధిక రక్తపోటుతో అనర్థాలెన్నో..
- యుక్త వయస్సులోనే గురవుతున్న యువకులు
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న బాధితులు
- ముందస్తు జాగ్రత్తలతో నివారణ సాధ్యమే..
- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే


ఎన్సీడీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఆధునిక జీవనశైలితో రక్తపోటు (బీపీ) బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. చాలామందికి బీపీ ఉందన్న విషయం తెలుసుకునేలోపే దీని వల్ల కలిగే అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయి. 120/80 ఉంటే సాధారణ బీపీగా లెక్కిస్తారు. ఇటీవల చిన్న వయస్సులోనే దీని బారిన పడుతున్నవారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతోంది. ప్రజలకు అవగాహన కలిగించానికి వరల్డ్ హైపర్ టెన్షన్ లీగ్ (డబ్ల్యూహెచ్ఎల్) సంస్థ 2005 నుంచి ఏటా మే 17న వరల్డ్ హైపర్ టెన్షన్ డే నిర్వహిస్తోంది.

సైలెంట్ కిల్లర్..

శరీరంలో రక్తాన్ని అన్ని రక్తనాళాలకు గుండె ఒత్తిడి చేసి (ప్రెజర్) పంపిస్తోంది. అధిక వేగంతో రక్తాన్ని ప్రసరింపజేసే శక్తినే బ్లడ్ ప్రెజర్‌గా పేర్కొంటారు. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా కూడా వైద్యులు పిలుస్తారు. చాలామందికి రక్తపోటు లక్షణాలు ఉన్నట్లు కూడా తెలియకపోవడం వల్ల ఉన్నట్టుండి గుండెపోటు వచ్చి కుప్పకూలి పోతారు. తలనొప్పి, అలసట అనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి. బీపీ చెకప్ చేయించుకోవాలి. పైరెండు లక్షణాలతో పాటు ముక్కు నుంచి రక్తం కారడం, ఊపిరి తీసుకోలేకపోవడం, చూపు సక్రమంగా కనిపించక పోవడం, చాతి నొప్పి వంటి లక్షణాలు బీపీ సోకిన వారిలో కనిపిస్తాయి.

కారణాలు..

అధిక రక్తపోటు సాధారణంగా వయస్సు మళ్లిన వారికి, కొందరికి జన్యుపరమైన కారణాలతో వస్తుంది. ధూమపానం, మద్యపానం, ఊబకాయం, పని చేయకుండా ఒకేచోట గంటల తరబడి ఉండటం, హైపోథెరాయిడ్, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సరిపడా నిద్ర, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మూత్ర పిండాల జబ్బు ద్వారా వస్తుంది. రోజువారి ఆహారంలో ఉప్పు, పచ్చళ్లు ఎక్కువగా తినడం, ప్యాక్ చేసి, నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినడం ద్వారా బీపీ బారినపడుతున్నారు. జనరల్ ఫిజీషియన్, కార్డియాలజిస్టు, నెఫ్రాలజిస్టు వైద్యుల వద్దకు చికిత్స కోసం వెళ్లేవారిలో ఎక్కువ శాతం మంది అధిక రక్తపోటు బాధితులే.

ఇంటింటికీ వెళ్లి బాధితుల గుర్తింపు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్సీడీ కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా ఇంటింటికీ వైద్యసిబ్బంది ద్వారా పరీక్షలు చేయించి బాధితులను గుర్తించి, చికిత్స అందిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఉన్న 30 ఏళ్లు పైబడి ఉన్న 6,23,444 ఉన్న వారికి ఎన్సీడీ ఆధ్వర్యంలో పరీక్షలు చేయాల్సి ఉంది. నేటి వరకు 30 ఏళ్లు దాటిన 4,88,761 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వీరిలో 87,463 మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్లు జిల్లా వైద్య అధికారులు నిర్ధారించారు. స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రాల్లోనే వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారు.

బీపీతో గుండెకు చేటు..



అధిక రక్తపోటు గుండెకు చేటు. చికిత్స కోసం వచ్చేవారిలో 30 శాతం మంది బీపీ వల్ల గుండెపోటుకు గురైన వారే. అధిక రక్తపోటుతో బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చే ప్రమాదం ఉంది. కంటి సంబంధిత సమస్యలు కూడా ఉత్పన్నమ వుతా యి. ప్రతి ఒక్కరూ బీపీపై అవగాహన పెంచుకోవాలి.

–డాక్టర్ సాయితేజరెడ్డి, కార్డియాలజిస్ట్,భద్రాచలం

ముందస్తు జాగ్రత్తలే ముఖ్యం..



ఆధునిక జీవనశైలి వల్ల వయస్సుతో సంబంధం లేకుండా అధిక రక్తపోటు బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఆహారంలో ఐదు గ్రాములకు మించి ఉప్పు తీసుకోవద్దు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి. సొంత వైద్యం కాకుండా వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలి.

–డాక్టర్ రమేశ్‌చంద్ర, సీనియర్ జనరల్ ఫిజీషియన్

విలువైన రాయి.. తరలిపోయి..

- 'సీతారామ' రాళ్ల తరలింపు..
- పట్టించుకోని అధికారులు


టిప్పర్లలో రాయిని తరలిస్తున్న దృశ్యం

ములకలపల్లి: సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐపీ) ప్రధాన కాల్వ తవ్వకంలో బయటపడిన పెద్ద రాళ్లు (హార్డ్ రాక్) మాయమవుతున్నాయి. క్రషింగ్‌కు అనుగుణంగా ఉన్న విలువైన రాళ్లను భారీ వాహనాలతో ముక్కలుగా పగులగొట్టి టిప్పర్లలో బయటకు తరలిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొత్తూరు శివారులోని సీతారామ ప్రధాన కాల్వపై వంతెన నిర్మించారు. ఈ ప్రదేశంలో కాల్వ తవ్వే సమయంలో క్రషర్‌లో వినియోగించేందుకు అనువైన గట్టి రాయి బయటపడింది. కాల్వ నిర్మాణం కోసం రాయిని బయట వేశారు. అయితే, పట్టపగలే భారీ జేసీబీ సాయంతో రాయిని వెలికితీసి, ముక్కలుగా మార్చి, టిప్పర్లలో తరలిస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న ఈ దందాతో విలువైన రాళ్లగుట్ట క్రమేపీ కరిగిపోతోంది. సంబంధితశాఖ అధికారులు దృష్టిసారించి రాయిని కాపాడాలని పలువురు కోరుతున్నారు. కాగా, ఈ ఘటనలపై ఇరిగేషన్ శాఖ ఏఈ నరేశ్‌ను వివరణ కోరగా.. కాల్వ ఒడ్డున ఉన్న రాళ్లను క్రషింగ్ చేసి, తిరిగి సీతారామ ప్రాజెక్ట్ పనులకే వినియోగిస్తామని తెలిపారు. ఎంత రాయి తరలిస్తే, అంతమేరకు మార్కెట్ రేటుకు అనుగుణంగా రివకరీ చేస్తామని చెప్పారు.

సీఈఓపై మొక్కుబడిగా విచారణ!

సొసైటీ డైరెక్టర్ల అసంతృప్తి


సొసైటీ కార్యాలయంలో విచారణ చేస్తున్న వీరేశంబాబు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సహకార సంఘంలో సీఈఓగా పనిచేస్తున్న మానేపల్లి విజయబాబు ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో దోపిడీ చేయడం, రైస్‌మిల్లర్లతో లాలూచీ పడుతున్నట్లు సొసైటీ డైరెక్టర్ బత్తిన పార్థసారథి ఆధ్వర్యంలో ఇటీవల డీసీఓ ఖుర్షీద్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదుపై స్పందించిన డీసీఓ విచారణకు ఆదేశించి, ప్రత్యేకాధికారిగా వీరేశంబాబును నియమించారు. ఆయన శుక్రవారం అశ్వారావుపేటలోని సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఫిర్యాదుదారుడు బత్తిన పార్థసారథితోపాటు కొందరు రైతులు హాజరయ్యారు. ఫిర్యాదులోని అంశాలను పక్కన పెట్టి, కేవలం ధాన్యం కేంద్రాల్లో ఉన్న ఇక్కట్లు, ఇప్పటిదాకా ధాన్యం కొనుగోలు చేయకపోడం వంటి అంశాలపై విచారణ చేపట్టారు. కనీసం ధాన్యం కేంద్రాల వద్దకు కూడా వెళ్లకుండా, అక్కడికి వచ్చిన రైతులతోనే మాట్లాడి విచారణను ముగించడం అను మానాలకు తావిస్తోంది. దీంతో ఫిర్యాదుదారుడు అసంతృప్తి వ్యక్తం చేసి, మరోసారి విచారణాధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించారు. ఇదే అంశాలపై సొసైటీ రిజిస్ట్రార్, జిల్లా కలెక్టర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పార్థసారథి తెలిపారు. కాగా, విచారణాధికారి మాట్లాడుతూ.. ఫిర్యాదు చేసిన సొసైటీ డైరెకర్లు, రైతులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని చెప్పారు.

వర్షానికి తడిసిన ధాన్యం


సుజాతనగర్: తడిసిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు

సుజాతనగర్: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసింది. వారం రోజుల కింద కురిసిన వర్షానికి నష్టపోయిన రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో ప్రకృతి మరోసారి కన్నెర్ర చేసింది. రాత్రి సమయంలో వర్షం కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని, తూకంలో ఆలస్యం జరుగుతోందని వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు 4 వేల వరకు ఉండగా..1500 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఉంది. అధికారులు స్పందించి త్వరగా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్: మండలంలోని కారెగట్టు ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిందని, వర్షం కురిసినప్పుడల్లా ధాన్యం ఆరబెట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కేవలం రెండు లోడ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని రైతులు చెబుతున్నారు. కాగా, మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని, లారీలు రాకపోవడంతో కొనుగోలులో జాప్యం జరుగుతోందని నిర్వాహకులు రవి తెలిపారు.


పాల్వంచరూరల్: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ శంకర్

అదుపుతప్పి పడిపోయిన బైక్

దంపతులకు తీవ్ర గాయాలు

సుజాతనగర్: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో దంపతులకు తీవ్ర గాయాలైన ఘటన స్థానిక గోధుమవాగు వంతెన సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. చంద్రుగొండ మండలం గానుగపాడుకు చెందిన బండారి చిన్నవెంకటేశ్వర్లు, మల్లమ్మ దంపతులు దిచక్రవాహనంపై కొత్తగూడెం వైపు వెళ్తున్నారు. గోధుమవాగు వంతెన సమీపానికి వెళ్లిన వీరి వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దంపతులకు తీవ్ర గాయాలు కాగా పోలీసుల సాయంతో ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, టీపీటీఎఫ్ నేత బాలు తీవ్రంగా గాయపడ్డాడు. ఇల్లెందు నుంచి స్వగ్రామమైన పోలారానికి స్కూటీపై వెళ్తున్న బాలును ఎదురుగా వచ్చిన మరో బైక్ నేరుగా ఢీకొట్టడంతో బాలు కాలు నుజ్జునుజ్జయింది. ఆయన్ను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధురాలు అదృశ్యం


కాశమ్మ

చింతకాని/కొణిజర్ల: ఆస్పత్రికి బయలుదేరిన వృద్ధురాలు కానరాకుండా పోయిన ఘటన ఇది. చింతకాని మండలం కోమట్లగూడెంకు చెందిన బొగ్గుల కాశమ్మ(65) గురువారం ఉదయం ఆటోలో కొణిజర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి, అక్కడ వైద్యుడు లేకపోవడంతో బయటకు వచ్చింది. తొలుత ఆమె పెద్దగోపతి గ్రామీణ వికాస బ్యాంకులో రూ.5వేలు విత్‌డ్రా చేసినట్లు తెలియగా, ఆతర్వాత ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె కుమారుడు సీతారాంరెడ్డి శుక్రవారం కొణిజర్ల, చింతకాని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని రామానుజవరానికి చెందిన దర్శనాల వెంకటేశ్వర్లు(60) మూడు రోజులుగా మద్యం సేవిస్తూ తిరుగుతున్నాడు. మిట్టపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఓ షాపులో మద్యం తాగి నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన అల్లుడు బీరెల్లి రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

వేంసూరు: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లింగపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాంపల్లి ఈశ్వరాచారి(42) ఇంటి ముందు ఉన్న కార్పెంటర్ షెడ్‌లో పడి ఉన్న విద్యుత్ వైర్‌ను సరిచేస్తున్నాడు. ఈక్రమంలో షాక్‌కు గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వరాచారి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

వడదెబ్బతో బాలిక..

రఘునాథపాలెం: వడదెబ్బ బారిన పడిన విద్యార్థిని మృతి చెందింది. రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన గ్రామీణ వైద్యుడు కస్తాల రాంబాబు – రాణి దంపతుల చిన్న కుమార్తె శరణ్య(14) ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. వేసవి సెలవుల నేపథ్యాన కొత్తగూడెంలోని బంధువులు ఇంటికి వెళ్లగా శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై పడిపోయింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంటర్‌లో చేర్పించేందుకు సిద్ధమవుతుండగా వడదెబ్బతో కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన చీకటి దీప్తి(28) గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఈ నెల 14న ఆమెను తల్లిదండ్రులు మందలించారనే మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయాన కలుపు మందు తాగింది. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు సత్తుపల్లికి, అక్కడి నుంచి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనుమరాలిని నృత్య శిక్షణకు తీసుకెళ్తూ..

- బొలెరో వాహనం ఢీకొని తాత మృతి
- బాలిక కాళ్లకు తీవ్రగాయాలు


నీరుడు రామారావు (ఫైల్)

పాల్వంచరూరల్: మనమరాలిని నృత్య తరగతులకు తీసుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని పునుకుల సమీపంలో చోటుచేసుకుంది. మనుమరాలి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన నీరుడు రామారావు (63) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరోతరగతి చదువుతున్న తన మనుమరాలు తులసి వేసవి సెలవులు కావడంతో పాల్వంచలో క్లాసికల్ నృత్యం నేర్చుకుంటోంది. దీంతో శుక్రవారం మనుమరాలిని తీసుకుని ద్విచక్ర వాహనంపై పాల్వంచకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పునుకుల సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే పాల్వంచ నుంచి కిన్నెరసాని వైపు వెళ్తున్న బొలెరో వాహనం టైర్ పంక్చర్ కావడంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రామారావుకు తలకు బలమైన గాయాలు కావడంతో మృతి చెందాడు. నాట్యం నేర్చుకుంటున్న మనుమరాలి రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. బాలికను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుడికి భార్య ముత్తమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం రామారావు పెద్ద కుమారుడు చిరంజీవి కూడా ట్రాక్టర్, ఆటో ఢీకొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇప్పుడు తండ్రి కూడా అదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందాడు. మృతదేహం వద్ద కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా చిన్నకుమారుడు అప్పారావు అమెరికాలో ఉంటుండగా, ఆయన వచ్చాక అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు: మండలంలోని సందెళ్ల రామాపురం అటవీ ప్రాంతంలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట మండలం చలమప్పగూడెం గ్రామానికి చెందిన బండారు ప్రేమ్‌కుమార్ అలియాస్ మేఘన (20) ఆరునెలల కిందట ఇంటి నుంచి బయటకు వచ్చి.. సందెళ్లరామాపురంలో హిజ్రాలతో కలిసి ఉంటున్నాడు. గత నెల 16న అనారోగ్యానికి గురికాగా.. తోటి హిజ్రాలు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం మనస్తాపంతో అక్కడి నుంచి ఈ నెల 13న బయటకు వెళ్లిపోయాడు. హిజ్రాలు గాలించినా కనిపించలేదు. శుక్రవారం ఉదయం సందెళ్లరామాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉరి వేసుకుని వేలాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ రాజేశ్ ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు ప్రేమ్‌కుమార్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

ఇల్లెందురూరల్: మండలంలోని రాఘబోయినగూడెం గ్రామ పంచాయతీ తంగెళ్లగడ్డ గ్రామానికి చెందిన మాళోత్ రాము (35) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న ఆయన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు దూలానికి వేలాడుతున్న రామును చూసి వెంటనే కిందకు దింపినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. రాముకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ మీద పడిన యువకుడు మృతి


వంశీ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ప్రమాదశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీదపడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. ములుగు జిల్లా వాజేడు మండలం, జగన్నాథపురం గ్రామానికి చెందిన వంశీ (23) సామ్రాట్ లాడ్జి పక్కన గదిలో ఉంటున్నాడు. పనిమీద బయటకు రాగా లాడ్జికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ యువకుడిపై పడటంతో మృతిచెందాడు. స్థానికులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. కాగా, పలువురు రాజకీయ నాయకులు, పలు కుల సంఘాల నాయకులు సదరు లాడ్జి ఎదుట వంశీ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకోగా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. గొడవ సద్దుమణిగాక వంశీ మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదవశాత్తు వంశీ మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో వివాహిత..


వేల్పుల రూప (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ యయాతి రాజు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం కాలనీలో వేల్పుల కిశోర్, రూప (25)తోపాటు మూడేళ్ల బాలుడు, ఏడాది వయస్సు ఉన్న కుమార్తె ఉంటున్నా రు. మధ్యాహ్నం సమయంలో కుమార్తెను పడుకోబెట్టి.. తడి బట్టలను ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డుకు కట్టిన దండెం (ఐరన్ తీగ)పై ఆరేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. చేతికి గాయాలు కాగా, అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో కుటుంబీకులు ఆటోలో అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యు లు మధ్యలోనే మృతిచెందిందని, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త కిశోర్ ఫిర్యాదుతో మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, సర్వీస్ వైరు ఐరన్ రేకుల రాపిడికి గురి కావడంతో విద్యుత్ సరఫరా అయిందని పోలీసులు తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి..

అశ్వాపురం: మండలంలోని చింతిర్యాలగూడెం గ్రామంలో రహదారి వెంబడి మురుగు కాలువలో పడి శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన పాయం కామరాజు (32) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ.. ఇంట్లోంచి బయటకు వచ్చాడు. రహదారి వెంబడి మురుగుకాలువలో పడి మృతి చెందాడు. ఎస్ఐ మధుప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.





హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

''అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిర పడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్

● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ ●

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలి సారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షనల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.



● అజయ్, రోషిణి

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

సగ్గుబియ్యం అప్పడాలు

కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.





స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది..

మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...

''లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరఫు, అమ్మ తరఫు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

వంటిల్లు

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.